నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 7-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 113 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఏడు రోజుల్లో న్యాయం జరిగింది - నిర్భయ తల్లి

న్యూఢిల్లీ,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దిశ హత్యాచార ఘటన నిందితులపై తెలంగాణ పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌ను నిర్భయ తల్లి స్వాగతించారు. ఎట్టకేలకు దిశకు న్యాయం జరిగిందన్నారు. ఏడేళ్ల నుంచి తన కుమార్తె విషయంలో పోరాటం కొనసాగిస్తూనే ఉన్నానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కానీ, దిశ తల్లిదండ్రులకు 7 రోజుల్లో న్యాయం జరగడం సంతోషంగా ఉందన్నారు. నిర్భయ ఘటనలో దోషులను కూడా వీలైనంత త్వరగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తీసుకున్న చర్యను సమర్థించిన ఆమె.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. మరోవైపు అత్యాచారాల కట్టడికి పటిష్ఠ చట్టం తీసుకురావాలంటూ నిరాహార దీక్ష చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ సైతం ఎన్‌కౌంటర్‌ను స్వాగతించారు. 'కస్టడీ నుంచి నిందితులు తప్పించుకుంటుంటే పోలీసులు మాత్రం ఏం చేస్తారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా చట్టాలను కఠినతరం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్!

దిశను సజీవదహనం చేసిన చోటే కాల్చివేత
కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం నిందితులను తీసుకెళ్లిన పోలీసులు
చటాన్‌పల్లి వంతెన వద్ద పోలీసులపై నిందితుల దాడి
రాళ్లవర్షం కురిపిస్తూ తప్పించుకొనేందుకు యత్నం
అప్రమత్తమై కాల్పులు జరిపిన పోలీసులు
నలుగురు నిందితులు అక్కడికక్కడే మృతి
ఘటన స్థలంలోనే పంచనామా.. భారీగా తరలివచ్చినప్రజలు
పోలీసుల తీరుపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు
ఘటన స్థలంలో పోలీసులపై పూలవర్షం కురిపించిన స్థానికులు

హైదరాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ వెటర్నరీ డాక్టర్ దిశ హత్య కేసులో నిందితులను పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున ఎన్‌కౌంటర్‌లో హతమార్చారు. హత్యాచార ఘటన సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల వద్ద ఉన్న ఆయుధాలను తీసుకొనేందుకు యత్నించినప్పటికీ సాధ్యం కాకపోవటంతో పోలీసులపై రాళ్లతో దాడికి దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. దిశను సజీవదహనం చేసిన చటాన్‌పల్లి వంతెన ప్రాంతంలోనే నిందితులు ఎన్‌కౌంటర్‌లో చనిపోవటం గమనార్హం. దిశ హత్య కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌ను సీపీ సజ్జనార్ నిర్ధారించారు. ఈ తెల్లవారుజామున 3నుంచి 6గంటల మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఆయన వెల్లడించారు. చటాన్‌పల్లి వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని సీపీ పరిశీలించారు. ఇదిలాఉంటే దిశ హత్యాచారం నిందితుల మృతదేహాలకు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలోనే శవపంచనామా నిర్వహించారు. స్థానిక మెజిస్ట్రేట్ సమక్షంలో శవపంచనామా పూర్తిచేశారు. ఒక్కో మృతదేహానికి ఒక్కో న్యాయాధికారి సమక్షంలో శపంచనామా నిర్వహించారు. ఏ1 నిందితుడు పాషా మృతదేహానికి ఫరూక్‌నగర్ తహసీల్దార్ పాండు నాయక్, ఏ2 నిందితుడు చెన్న కేశవుల మృతదేహానికి పొందుర్లు తహసీల్దార్ శ్రీకాంత్ శవపంచనామా నిర్వహించగా.. ఏ3 నిందితుడు శివ మృతదేహానికి నందిగామ తహసీల్దార్ హైదర్ అలీ, ఏ4 నిందితుడు నవీన్ మృతదేహానికి చౌదరిగూడ తహసీల్దార్ రాముడు శవపంచనామా నిర్వహించారు. తొలుత శవపరీక్షలు కూడా అక్కడే నిర్వహించాలనుకున్న పోలీసులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. మృతదేహాలను మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడే శవపరీక్షలు నిర్వహించారు. శవపరీక్షలు నిర్వహించేందుకు ఐదుగురు వైద్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి నుంచి మహబూబ్‌నగర్‌కు చేరుకొని పంచనామా నిర్వహించారు.

ఘటన జరిగిన 10రోజుల్లోనే..!

దిశ హత్యాచారం, హత్య జరిగిన ఘటన జరిగి సరిగ్గా 10రోజుల్లోనే నిందితులు పోలీసులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. నవంబర్ 27న బుధవారం సాయంత్రం నుంచి దిశా కనిపించకుండా పోయింది. తన చెల్లితో మాట్లాడిన కొద్దిసేపటికే ఫోన్ స్విచ్ ఆఫ్‌కావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నవంబర్ 28వ తేదీ గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ సమీపంలో దిశ దారుణ హత్యకుగురైనట్లు గుర్తించారు. 24వ నేషనల్ హైవే దగ్గర ఓ వంతెన కింద దారుణంగా హత్య చేసి గుర్తు తెలియకుండా పెట్రోల్ పోసి తగులబెట్టారు. హత్యకు ముందు అత్యంత పాశవికంగా ఆమెపై అత్యాచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలతో దేశ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. నిందితులను ఉరితీయాలంటూ ప్రజలంతా ముక్తకంఠంతో నినదించారు. ఈ కేసును పటిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ జరిపి నవంబర్ 28న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఏ1 మహ్మద్, ఏ 2 జొల్లు శివ, ఏ 3 చెన్నకేశవులు, ఏ 4 నవీన్ కుమార్‌లుగా గుర్తించారు. వీరంతా లారీ డ్రైవర్‌లు, క్లీనర్లుగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించటంతో తామే హత్యాచారం చేసి పెట్రోల్‌పోసి హత్యచేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో నవంబర్ 29వ తేదీన షాద్ నగర్ పీఎస్‌లో నిందితులను విచారించారు. నిందితులకు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. నవంబర్ 30న నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. షాద్ నగర్ నుంచి నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలిస్తుండగా నిరసనకారులు బస్సులపై రాళ్లు రువ్వారు. నిందితులను ఉరి తీయాలని డిమాండ్ వినిపించాయి. డిసెంబర్ 04వ తేదీన నిందితులను పోలీసు కస్టడీకి కోర్టు అనుమతినివ్వడంతో డిసెంబర్ 05వ తేదీన నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. కేసు రీకనస్ట్రక్షన్ నిమిత్తం నిందితులను హత్యజరిగిన ప్రాంతాలకు పోలీసులు తీసుకెళ్లారు. బుధవారం రాత్రి ఘటన జరిగిన ప్రాంతాల్లో నిందితులను తీసుకెళ్లగా దిశ సెల్‌ఫోన్ ఎక్కడ దాచిందో చెప్పడంతో సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు అదే రీతిలో గురువారం రాత్రి సమయంలోనూ షాద్‌నగర్‌లో ఘటన జరిగిన ప్రాంతాలకు నిందితులను తీసుకెళ్లారు. ఈ సమయంలో షాద్‌నగర్‌లోని చటాన్‌పల్లి వంతెన వద్దకు నిందితులను తీసుకెళ్లడంతో వారు ఒక్కసారిగా పోలీసులపై ఎదురుతిరిగారు. పోలీసుల వద్ద ఉన్న గన్‌లను తీసుకొనే ప్రయత్నం చేయడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని నిరోధించారు. దీంతో నిందితులు పోలీసులపై రాళ్లదాడికి దిగి పరారయ్యేందుకు యత్నించారు. దీంతో ప్రాణరక్షణ కోసం పోలీసులు నిందితులపై కాల్పులు జరడపంతో అక్కడికక్కడే నిందితులు మృతిచెందారు.

పోలీసులపై పూలవర్షం..

దిశ హత్యాచార ఘటనలో నలుగురు నిందితులను పోలీసులను ఎన్‌కౌంటర్ చేసిన వేళ హైదరాబాద్ పోలీస్ విభాగానికి దేశ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు శుక్రవారం తెల్లవారు జామున ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే చుట్టుపక్కల వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్యాచారం జరిగినప్పటి నుంచి నిందితులపై జనం ఆగ్రహావేశాలతో రగిలిపోతున్న సంగతి తెలిసిందే. అనూహ్యంగా ఎన్‌కౌంటర్ వార్త చెవిన పడేసరికి చుట్టు పక్కల వారంతా ఆనందంతో సమీపంలోని వంతెనపైకి చేరుకున్నారు. తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తూ.. పోలీసులపై పూల వర్షం కురిపించారు. 'తెలంగాణ పోలీస్ జిందాబాద్.. సాహో సీపీ సజ్జనార్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు, నిందితుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో బాధితురాలి ఇంటి చుట్టు పక్కల ఉండే వాళ్లు పెద్ద ఎత్తున ఆమె ఇంటి వద్దకు చేరుకున్నారు. కొందరు మిఠాయిలు పంచుకున్నారు. దీంతో దిశ ఇంటి వద్ద కోలాహలం నెలకొంది. కొందరు ఉద్యమకారులు పోలీసులకు స్వీట్లు పంచి, అభినందించారు. హైదరాబాద్ సహా విజయవాడ వంటి పలు నగరాల్లో యువతులు ఆనందోత్సాహాలతో డాన్సులు చేశారు. పోలీసుల తాజా చర్యతో తమకు భద్రతా భావం కలుగుతోందని కొందరు యువతులు పేర్కొన్నారు. ఎవరైనా మహిళకు అన్యాయం జరిగితే పోలీసులు అండగా ఉన్నారని ఈ ఘటనతో నిరూపితం అయిందని ఆనందం వ్యక్తం చేశారు.

దిశ హంతకుల ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని సందర్శించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

ఎన్‌కౌంటర్ వార్త తెలుసుకుని దిశ తల్లిదండ్రులు నివసించే శంషాబాద్ నక్షత్ర కాలనీలో పోలీసులకు సెల్యూట్ చేస్తున్న మహిళలు

ఎన్‌కౌంటర్ వార్త తెలుసుకుని దిశ తల్లిదండ్రులు నివసించే శంషాబాద్ నక్షత్ర కాలనీలో స్వీట్లు పంచిన మహిళలుఎన్‌కౌంటర్ వార్త తెలుసుకుని దిశ తల్లిదండ్రులు నివసించే శంషాబాద్ నక్షత్ర కాలనీలో పోలీసులకు సెల్యూట్ చేస్తున్న మహిళలు

ఎన్‌కౌంటర్ వార్త తెలుసుకుని దిశ తల్లిదండ్రులు నివసించే శంషాబాద్ నక్షత్ర కాలనీలో బాణాసంచా కాల్చిన ప్రజలు

11ఏళ్ల క్రితం వరంగల్ ఘటన పునరావృతం

హైదరాబాద్, డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా సంచలనం రేపిన వెటర్నరీ డాక్టర్ దిశ హత్యకేసులో నిందితులు ఎన్‌కౌంటర్ అయ్యారు. శంషాబాద్ సమీపంలో చటాన్ పల్లి దగ్గర నలుగుర్ని కాల్చి చంపారు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌తో.. వరంగల్‌లో యాసిడ్ దాడి నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. రెండు ఘటనల్లో సీనియర్ ఐపీఎస్, ప్రస్తుత సైబరాబాద్ సీపీ సజ్జనార్ కేసుల్ని డీల్ చేశారు. రెండు ఎన్‌కౌంటర్‌ల సమయంలో సజ్జనార్ కీలక బాధ్యతల్లో ఉన్నారని నెటిజన్లు గుర్తు చేసుకుంటున్నారు. 2008 సీన్ మళ్లీ రిపీట్ అయ్యిందంటున్నారు. 2008లో ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్ జిల్లాలో జరిగిన ఘటనను నెటిజన్లు గుర్తు చేసుకుంటున్నారు. 2008 డిసెంబర్‌లో వరంగల్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న స్వప్నిక తన స్నేహితురాలు ప్రణీతతో కలిసి స్కూటీపై కాలేజీకి వెళుతోంది. అదే సమయంలో మార్గ మధ్యలో మాటువేసిన శ్రీనివాస్ అనే యువకుడు స్వప్నికపై యాసిడ్‌తో దాడిచేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన స్వప్నికను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనగా ఉండటంతో.. సికింద్రబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్సపొందుతూ ఆమె చనిపోయింది. స్కూటీ వెనుక కూర్చొన్న ప్రణీత తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడితో పాటూ అతడికి సహకరించిన స్నేహితుల్ని అరెస్ట్ చేశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటి సైబరాబాద్ సీపీ సజ్జనార్.. అప్పుడు వరంగల్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుల్ని ఘటన జరిగిన ప్రదేశానికి తీసుకెళ్లిన సమయంలో.. పారిపోయేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులు చనిపోయారు. అప్పట్లో దేశ వ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు ఎన్ కౌంటర్ పై హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. అప్పుడు, ఇప్పుడు ఎన్కౌంటర్ క్రెడిట్ ఐపీఎస్ అధికారి విశ్వనాథ్ చెన్నప్ప సజ్జన్నార్ దే.

వరంగల్‌లో ఏం జరిగిందంటే..!

11ఏళ్ల తరువాత సేమ్‌సీన్ రిపీట్..

సరిగ్గా 11ఏళ్ల తరువాత సేమ్ ఇన్సిడెంట్ రిపీట్ అయ్యింది. అప్పుడు, ఇప్పుడు డిసెంబర్ నెల కావడం గమనార్హం. తాజాగా దిశ హత్యకేసు ఘటనలోనూ సేమ్‌సీన్ రిపీట్ అయింది. గత నెల 27న నలుగురు నిందితులు దిశపై హత్యాచారంకు పాల్పడి పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సజ్జనార్ రెండురోజుల్లో నిందితులను పట్టుకున్నారు. వీరిన విచారణ అనంతరం చర్లపల్లి జైలుకు పంపించారు. కాగా విచారణ నిమిత్తం పోలీసులు రెండు రోజుల క్రితం వీరినలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఘటన జరిగిన పలు ప్రాంతాల్లోకి వీరిని తీసుకెళ్లి దిశ సెల్‌ఫోన్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగాఅదే రీతిలో గురువారం అర్ధరాత్రి దిశను పెట్రోల్ పోసి హతమార్చిన ప్రదేశానికి కేసు విచారణ నిమిత్తం నిందితులను తీసుకెళ్లారు. ఇదే సమయంలో నిందితులు పరారయ్యేందుకు ప్రయతి దంతో పోలీసులు వారిని ఎన్‌కౌంటర్ చేశారు. తాజాగా జరిగిన ఘటనకు సంబంధించి ప్రస్తుతం సైబరాబాద్ సీపీగా ఉన్న సజ్జనార్ అప్పుడు వరంగల్ ఎస్పీగా ఉన్నారు. దీంతో వరంగల్ ఘటనను గుర్తు చేసుకుంటున్నారు నెటిజన్లు.. ఈ తాజాగా జరిగిన అఘాయిత్యంతో పోల్చి చూస్తున్నారు.

సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం

పోలీసుల తీరును తప్పుపట్టిన వారే జేజేలు

హైదరాబాద్, డిసెంబర్6(ఆర్ఎన్ఎ) : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ హత్యాచార కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై సామాజిక మాధ్యమాల్లో హర్షం వ్యక్తవ ఎవుతోంది. తొలుత పోలీసుల నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడిన వారే ఇప్పుడు వారిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'జై పోలీస్! జై జై పోలీస్!!' అంటూ యువ బృందాలు నినదిస్తున్నాయి. మరోవైపు సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్‌పైనా సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. 'సాహో సజ్జనార్, శభాష్ సజ్జనార్' అన్న అభినందను వెల్లువెత్తుతున్నాయి. గతంలో వరంగల్‌లో యాసిడ్ దాడి నిందితులనూ పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వరంగల్ ఎస్పీగా సజ్జనార్ ఉన్నారు. ఇప్పుడు దిశ హత్యాచార ఘటనను డీల్ చేస్తోంది కూడా ఆయన ఆధ్వర్యంలోనే. అయితే ఇది యాదృశ్చికమే అయినప్పటికీ.. ప్రజలు ఆయన్ని పొగకుండా ఉండలేకపోతున్నారు. ' సాహో సజ్జనార్!' అంటూ పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. 'ఈ ఎన్‌కౌంటర్‌తో సమాజంలో కీచకుల దాడికి బలైన వారికి సత్వర న్యాయం చేస్తారన్న భరోసా ఇచ్చారు' అంటూ ఓ మహిళ స్పందించింది. మరో నెటిజన్ స్పందిస్తూ.. 'రియల్ లైఫ్ సింగం' అంటూ ప్రశంసించారు. పోలీసుల చర్యతో ప్రజలంతా సంతోషిస్తున్నారని మరికొంత మంది స్పందిస్తున్నారు. 'నేరస్థులకు ఎన్‌కౌంటర్ ద్వారా తగిన గుణపాఠం చెప్పే పోలీస్ అధికారి తెలంగాణలో ఉన్నందుకు గర్వంగా ఉందంటూ మరికొంత మంది ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ బాధ ఇంకెవ్వరికీ రాకూడదు - దిశ తల్లి

హైదరాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దిశ అత్యాచారం, హత్య కేసులో నలుగురు నిందితులు శుక్రవారం తెల్లవారుజామున పోలీసు ఎన్‌కౌంటర్లో చనిపోయారు. ఆ విషయం తెలిసిన తరువాత 'దిశ' తల్లి స్పందించారు. ఆ అబ్బాయిలు ఒక్క నిమిషం ఆలోచించి ఉంటే.. నా అక్క, నా చెల్లిలాంటిదే కదా అని అనుకుని ఉంటే అక్కడ ఆ నలుగురు తల్లులు, ఇక్కడ నేను ఇంత బాధపడే పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. వాళ్లకు అలా అయినందుకు కూడా నేనెంతో బాధ పడుతున్నానని అన్నారు. మా అమ్మాయి ఎంతో మంచిదని, ఆమె ఎంతో మంచిగా ఆలోచించేదని, ఆ మంచితనమే తనను తీసుకువెళ్ళిపోయిందేమో అని అనిపిస్తుందని అన్నారు. నా గుండెలో ఎంత బాధ ఉందో చెప్పలేకపోతున్నానని, ఈ బాధ అనుభవించేవాళ్ళకే తెలుస్తుందని, ఈ బాధ ఇంకెవ్వరికీ రాకూడదని కన్నీటి పర్యాంతమవుతూ తెలిపారు. మా అమ్మాయి ఆత్మ శాంతించిందని, పోలీసువాళ్ళకు, మీడియాకు, మా కాలనీ వాసులకు అందరికీ నమస్కారాలు తెలుపుతున్నానని అన్నారు. మాకు న్యాయం జరిగిందని, కానీ ఏ ఆడపిల్లకూ ఇలాంటిది జరగకూడదని దిశ తల్లి ఆవేదన తెలిపారు.

ఎన్‌కౌంటర్ మంచి నిర్ణయం - దిశ సోదరి

దిశ హత్యాచార నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం మంచి నిర్ణయమని ఆమె సోదరి పేర్కొన్నారు. నిందితులను ఉరి తీస్తారని అనుకున్నాం. నిందితుల ఎన్‌కౌంటర్‌తో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని దిశ సోదరి పేర్కొన్నారు. తన సోదరిని అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు 24 గంటల్లోనే పట్టుకున్నారు. తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు దిశ సోదరి. ఈ కేసు విషయంలో పోలీసులు చాలా వేగంగా చర్య తీసుకుని నిందితులకు సరైన పనిష్‌మెంట్ ఇచ్చారని దిశ సోదరి స్పష్టం చేశారు.

చరిత్రలో నేటినిజం

కం॥ సుతి మెత్తని భారతంలో
'అతి'గా వర్ణించినట్టి పాత్రములూదన్
చతురతలో వెలగాంచగ
స్మృతి యించెద "ధర్మవరపు సుబ్రహ్మణ్యున్" !!

(డిసెంబర్ 7 ధర్మవరపు సుబ్రహ్మణ్యం వర్ధంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

దుర్మార్గులకు ఇదో హెచ్చరిక

-తెలంగాణ మంత్రి గంగుల

హైదరాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దిశ నిందితుల ఎన్ కౌంటర్ చేయటం దుర్మార్గులకు ఇదో హెచ్చరిక అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇది తెలంగాణ పోలీస్ సత్తా అని కొనియాడారు. అడబిడ్డలపై ఇటువంటి అరాచకాలు జరగకుండా ఇదొక హెచ్చరిక అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై పోలీసులు అంకితభావంతో పనిచేస్తున్నారనీ..సంఘ వ్యతిరేక శక్తులకు రాష్ట్రంలో చోటులేదని చెప్పటానికి దిశ ఎన్ కౌంటర్ నిదర్శనమని తెలంగాణ పోలీసులు మరోసారి రుజువు చేశారనీ అన్నారు. దిశ ఘటన విషయంలో నిందితుల్ని శిక్షి విధించటానికి ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదనీ, ఏకంగా పోలీసులపైనే నిందితులు దాడికి పాల్పడినందు వల్ల వారిని ఎన్ కౌంటర్ చేశారని మంత్రి గంగులు కమాలాకర్ స్పష్టం చేశారు.

ఎన్‌కౌంటర్‌ను సమర్ధిస్తున్నా - సీపీఐ నారాయణ

దిశ హత్యాచార ఘటనలో నిందితులు నలుగురిని పోలీసు డిపార్ట్ మెంట్ ఎన్ కౌంటర్ చేయటం శుభం సంతోషం అని సీపీఐ నేత నారాయణ అన్నారు. మహిళలపై ఇలాంటి అత్యాచార ఘటనలు జరగకుండా ఉండాలంటే ఇలాంటి చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఇలాంటి వారి వల్ల భవిష్యత్తులో లాఅండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తున్నమాట వాస్తవమేనని అన్నారు. ఇలాంటి సమయంలో వాటి గురించి చర్చించాల్సిన అవసరం లేదని అన్నారు. ఇలాంటి ఘోరమైన ఘటనలు జరగకుండా ఉండాలంటే నిందితులను హతమార్చటం అవసరం అని ఆయన అభిప్రాయ పడ్డారు. నిందితుల ఎన్ కౌంటర్ ను సమర్ధిస్తున్నాని నారాయణ చెప్పారు.

పచ్చదనానికి ప్రపంచీకరణానికి మధ్య.!

నేటినిజం
శనివారం 7-12-2019

పచ్చదనానికీ, ప్రపంచీకరణకు మధ్య కొనసాగుతున్న సంఘర్షణలో ఒకవైపు ప్రభుత్వాలు, మరోవైపు రాజకీయ పక్షాలు ప్రపంచీకరణకు బాసటగా నిలబడటం దీర్ఘకాల ప్రగతికి గొడ్డలిపెట్టు.

భూమిని, పర్యావరణాన్ని కబళిస్తున్న కేంద్రీకృత కృత్రిమ ప్రగతి కేవలం తాత్కాలిక భ్రాంతి మాత్రమే! కానీ, వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తున్న అటవీ హననం చేస్తున్న పారిశ్రామిక ప్రాబల్యానికి ప్రభుత్వాలు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. హరిత పరిరక్షణ నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా పుట్టుకొచ్చిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం వారు తక్షణం మూసివేయాలి. 'హరిత అనుమతుల' ను పొందిన తరువాత మళ్ళీ ఆ పారిశ్రామిక సంస్థలు ప్రారంభం కావచ్చు! కానీ ఈ నియమాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇపుడు నీరు కార్చింది. పరిశ్రమలకు గొప్ప వెసులుబాటు కల్పించింది.

పచ్చదనంపై ప్రపంచీకరణ పైచేయి అవుతుండటానికి ఇది సరికొత్త ఉదాహరణ 'పర్యావరణ అనుమతి' ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్–ఇసి లేకుండానే పరిశ్రమలను నడిపిస్తున్న యజమానులు ఆరు నెలలలోగా కొత్తగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నది కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటు అంటే ఇది హరిత నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను క్రమబద్ధీకరించడం వంటిది.

నియమనిబంధనలను పాటించకుండా పర్యావరణాన్ని పాడుచేసే అంటున్నారు. ఇదే రీతిలో పర్యావరణ నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసివేయాలి. కానీ 'రుసుము' తీసుకొని క్రమబద్ధీకరించినందువల్ల, కాలుష్యపు విషాలను కక్కి పరిసరాలను పాడుచేస్తున్న పరిశ్రమల స్వభావం మారిపోతుందా? అనేది ఆలోచించాలి.

ఇవన్నీ గత ప్రభుత్వం ఇచ్చిన వారసత్వమే. ఈ వారసత్వం కారణంగానే ఇపుడు అక్రమ పరిశ్రమలకు ఆరునెలలలోగా 'హరిత అనుమతి' ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

లక్ష్యంతో నగరాలలో అంతస్థులను నిర్మిస్తున్నారు.

కానీ ఆ తర్వాత స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రప్రభుత్వాలు కొంత రుసుమును కట్టించుకుని ఈ 'అక్రమాల'ను సక్రమాలుగా మారుస్తున్నారు. దీనికే క్రమబద్ధీకరణ

మరి అడవులకు దిక్కెవ్వరు? హరిత శోభల 'క్షతి'ని నిరోధించి శోభను నిలబెట్టేవారు ఎవ్వరు? ఆకుపచ్చదనం నిజమైన ప్రగతికి సంకేతం! కానీ దశాబ్దాల తరబడి వ్యవసాయభూముల విస్తీర్ణం తగ్గిపోతోంది! దేశంలో మొత్తం భూభాగంలో కనీసం ముప్పై మూడు శాతం అడవులుండాలనేది అంతర్జాతీయ ఆదర్శం కానీ మన దేశంలో ఇరవైనాలుగు శాతం కంటే తక్కువ భూభాగంలో మాత్రమే అడవులున్నాయి.

గత రెండేళ్ళుగా అడవుల విస్తీర్ణం తెలుగు రాష్ట్రాలలో మరీ తగ్గిపోయిందనేది సమాచారం. 'హరితహారం' 'చెట్టు నీరు' వంటి కార్యక్రమాల వల్ల అడవుల విస్తీర్ణం పెరగకపోవడమే అంతుపట్టని వ్యవహారం. అడవులతోపాటు జంతువులు కూడా నశించిపోతున్నాయి. అడవులలో నీటివాగులు ఎండిపోవడం వల్ల క్రూర జంతువులు, సాధుజంతువులు సమానంగా దప్పికతో అంతరించిపోతున్నాయి. ఇవి కాక అగ్నిప్రమాదాలు ! ఇక అరణ్యాలకు రక్షణ ఎపుడు..?

పోలీసులకు సలాం

హైదరాబాద్, డిసెంబర్ 6:దిశను అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి,ప్రాణాలతో ఉండగానే తగులబెట్టిన నలుగురు రాక్షసులు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. తొలిపొద్దు పొడవకముందే వారిజీవితాలు కూడా చీకట్లో కలిశాయి. దిశను చీకట్లోనే చిదిమేసిన వారిజీవితాలు కూడా చికట్లోనే తెల్లారాయి. ఈ మొత్తం ఘటనలో దిశ తల్లిదండ్రులకు కొంత ఊరట దక్కినా వారి కూతురు మాత్రం తిరిగి రాదని గుర్తుంచుకోవాలి. వారి కడుపుకోతను ఎవరూ తీర్చలేనిది. అర్థాంతరంగా మాయమైన తమ కూతురిని తల్చుకుని వారు జీవితాంతం ఏడుస్తూ ఉండాల్సిందే. నిర్భయ కేసు జరిగి ఏడేళ్లయినా నిందితులకు శిక్ష పడలేదు...ఉన్నావ్ అత్యాచారం కేసులో నిందితులు బెయిల్‌పై వచ్చి బాధితురాలు కోర్టుకు పోకుండా అడ్డుకుని తగులబెట్టే ప్రయత్నం చేశారు. దేశంలో ఇలాంటి ఘటనలు అనేకంగా ఉన్నాయి. బాధితులకు న్యాయం జరగలేదు. ఎందరో అమాయక అమ్మాయిలు మృగాళ్లకు బలవుతున్నారు. అభశుభం తెలియని చిన్నారులు కూడా బలయ్యారు. వీరందరి కేసులో ఎవరికి కూడా న్యాయం జరగలేదు. ఈ దశలో ప్రజల్లో తీవ్ర ఆందోళనలు, ఆగ్రహాలు గూడుకట్టుకున్నాయి. మృగాళ్లను ఉరితీయాలి...ముక్కలుగా నరకాలి...పొడిచి పారేయాలి. అన్నంత కసి బయటపడింది. ఆ కసే ఇప్పుడు నిజమయ్యింది. దిశ హత్యాచార ఘటనకు కారకులైన వారు ఎన్‌కౌంటర్ కావడంతో నిజంగానే న్యాయం జరిగిందని ప్రజలు హర్షిస్తున్నారు. ఎందుకంటే కోర్టుల చుట్టూ తిరిగితే న్యాయం జరగదు. అందుకే సైబరాబాద్ పోలీస్ చర్యను సమర్థిస్తున్నారు. పోలీసులను అభినందిస్తున్నారు. వారికి స్వీట్లు తినిపిస్తున్నారు. బాణాసంచా కాల్చారు. పోలీసులను అభినందిస్తూ నినాదాలు చేస్తున్నారు. నరకాసుర వధ జరిగిందో లేదో కానీ ఇక్కడ అలాంటి వాతావరణం ప్రజల కళ్లకు కట్టింది. నరకాసురులు హతం అయ్యారన్న ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చట్టాలపై నమ్మకం కోల్పోతే ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారు. అలాంటి పరిస్థితులు రాకుండా ...ఉన్న చట్టాల మేరకు నిందితులకు కఠిన శిక్షలు పడాలి. అలా జరిగివుంటే ఇలాంటి ఘటనలు జరగవు. అకృత్యాలు పునరావృతం కావు.

ఇకపోతే ఈ ఎన్‌కౌంటర్ ద్వారా తాగి అకృత్యాలకు పాల్పడితే ఖతం కావాల్సిందే అన్న సందేశాన్ని పోలీసులు పంపారు. దిశ ఘటనతో దేశ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్న తరుణంలో ఈ ఎన్‌కౌంటర్‌తో పోలీసులు హీరోలు అయ్యారు. న్యాయస్థానాలు చేయలేని పనిని పోలీసులు చేశారన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది. నిజానికి నిందితులను గుర్తించి పట్టుకున్నప్పుడే ప్రజలంతా ఆ కూరులను తమకు అప్పగించాలని, తామే ఖతం చేస్తామని ఆందోళనకు దిగారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌పైకి దాడికి దిగారు. నిజానికి పోలీసులు అలా నిందితులను వదిలివుంటే ఆరోజే వారు ఖతం అయ్యేవారు. ఇదంతా ప్రజల్ల గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి షాద్‌నగర్ దగ్గర దిశ ఘటన చోటు చేసుకున్న తరవాత దేశ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఆగ్రహం,ఆందోళన వ్యక్తం అయ్యింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా నలుగురు నిందితులు పారిపోయారు. పారిపోతున్న నిందితులపై పోలీసులు కాల్పులు జరపడంతో నలుగురు నిందితులు మృతి చెందారు. గత నెల 27వ తేదీన వెటర్నరీ డాక్టర్ దిశపై అత్యాచారం చేసిన నిందితులు చటాన్‌పల్లి వద్ద బ్రిడ్జి కింద దిశను పెట్రోల్ పోసి కాల్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ప్రదేశంలో పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ ప్రదేశంలో చీకటిగా ఉన్న పరిస్థితులను అనుకూలంగా చేసుకున్న నిందితులు తమ బుద్ధిని చూపించి పోలీసులపై దాడికి దిగారు. పారిపోయే యత్నం చేశారు. పోలీసులపై రాళ్లతోదాడికి యత్నించారు. ఈ దశలో వారిని పట్టుకునే క్రమంలో తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని సమాచారం. జైల్లో

ఉన్నప్పుడు నిందితులను హై సెక్యూరిటీ మధ్య వేర్వేరుగా ఉంచారు. రాత్రి 12గంటల ప్రాంతంలో చర్లపల్లి జైలు నుంచి బయటకు తీసుకువచ్చారు. నిందితులను ఘటనకు పాల్పడిన ప్రాంతానికి తీసుకురాగానే దిశ సెల్ ఫోన్ గుర్తించేందుకు డీసీపీ సందీప్ రావు నేతృత్వంలోని బృందం అరగంటపాటు విచారణ జరిగిన అనంతరం నిందితులకు ముందు తెలిసిన ప్రాంతం కావడంతో వారి నేరబుద్ధి చూపించారు. ఆరిఫ్ మొదట పోలీసులపై దాడి చేశాడు. అనంతరం మిగితా ముగ్గురు పోలీసులపై తిరగబడ్డారు. నిందితులు తుపాకులు లాక్కు నేందుకు ప్రయత్నించారు. అది వీలుకాకపోవడంతో రాళ్లదాడి చేస్తూ పారిపోతుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరిఫ్ పాషా, జొల్లు శివ, నవీన్, చెన్నకేశవులు మృతి చెందారు. పోలీస్ కమిషనర్ సజ్జనర్ ఘటనా స్థలానికి చేరుకుని ఎన్‌కౌంటర్ పై విచారణ చేపట్టారు. మొత్తంగా ఈ ఘటనతో మృగాళ్లకు భయం కలగడం ఖాయం. ఇలాంటి నేరాలు చేయాలంటే భయం కలగాలన్న రీతిలో పోలీసులు ముగింపు పలికారు. ఇకముందు అమ్మాయిలను ఒంటరిగా చూసినా తలదించుకుని వెళ్లేలా భయం కల్పించారు. సమాజం పెడదోవ పడుతున్న దశలో ఇలాంటి ఘటనలో తప్పవని గుర్తించాలి. దిశ హత్యాచార కేసుపై దేశవ్యాప్త ఆందోళనలు జరుగుతున్న వేళ .. ఇలాంటి ఘటనలు ఎక్కడా ఆగడం లేదు. వరుసబెట్టి అత్యాచారాలు.. హత్యలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల దృష్టికి వచ్చే కొన్ని సంఘటనల పైనే ఆందోళనలు సాగు తున్నాయి. నిజానికి ప్రతి చిన్న సంఘటన పైనా పెద్ద ఎత్తున ఆందోళన సాగాలి. ఇలాంటి ఘటనలకు సంబంధించి పూర్తి న్యాయం జరగాలి. కఠిన శిక్షలకు పూనుకోవడం ఒక ఎత్తయితే త్వరగా శిక్షలు పడేలా కోర్టులు చూడాలి. ఇదే దశలో దేశంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, ఇంటర్నెట్ వినియోగం,అశ్లీల వీడియోల వల్ల చెడిపోతున్న యువతను సన్మార్గంలో పెట్టే యత్నాలు సాగాలి. దిశ హత్య కేసుకు ముగింపు పలికిన పోలీసుల చర్యను ఎవరైనా అభినందించాల్సిందే. ప్రజలు అభినందిస్తున్నారంటే కారణం న్యాయం జరిగిందని భావించడం వల్లనే అని గుర్తుంచుకోవాలి.

హాజీపూర్ ఘటనపై తాత్సారం

సత్వరం పూర్తి చేయాలంటున్న ప్రజలు
దిశ కేసుతో వేగం పెరగగలదన్న భావన

యాదాద్రి భువనగిరి,డిసెబర్6(ఆర్ ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన హాజీపూర్ బాలికల వరుస హత్యల కేసు మరోమారు తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై ఎందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదని ఎమ్మార్పీఎస్ వ్యస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. కుమ్రం భీమ్ జిల్లాలో జరిగిన లక్ష్మి హత్యాచార ఘటనను, మాజీపూర్ ఘటనను పెద్దగా పట్టించుకోవడం లేదనా న్నరు. కులమతాల ఆధారంగా కేసులను చూడొద్దన్నారు. తాజాగా దిశ హంతకుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో హాజీపూర్ ఘటనకు సంబంధించిన కేసుకూడా దర్యాప్తులో వేగం అందుకుం టుందన్న భావన కలుగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీ పూర్ గ్రామంలో ముగ్గురు బాలికలను అత్యా చారం, హత్య చేసిన నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి కేసు అక్టోబర్ 10వ తేదీన నల్లగొండ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ ప్రారంభ మైంది. బాధిత కుటుంబ సభ్యులు, పలువురు గ్రామస్తులు, జిల్లా పోలీస్ అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారులకు 120 మందికి కోర్టు సమన్లు అందాయి. సైకో శ్రీనివాస్‌రెడ్డి హాజీపూర్ గ్రామానికి చెందిన పామూల శ్రావణి, తిప్రబోయిన మనీషా, మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుంగని కల్పనలపై అఘాయిత్యాలకు పాల్పడి హత్య చేసిన కేసులో వరంగల్ సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న శ్రీనివాస్ రెడ్డిపై కేసులు నమోదైన 90 రోజుల అనంతరం జూలై 31న యాదాద్రి భునవగిరి ఏసీపీ భుజంగరావు నల్లగొండ పోక్సో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. హాజీపూర్ బాలికల వరుస హత్యల కేసులో విచారణ లో వేగం పెరిగిందని హాజీపూర్ బాలికల హత్య కేసుల విచారణ అధికారి ఏసీపీ భుజంగరావు తెలిపారు. ఈ కేసుల్లో ప్రథమంగా బలైన తుంగని కల్పన కేసు మూడేళ్ల క్రితం నాటిది కావడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. నేటికీ 100 మందికి పైగా సాక్షులను కోర్టు విచారణ చేసింది. మరికొంత మందిని విచారణ చేయాల్సి ఉంది. మరో రెండు వారాల పాటు కోర్టులో సాక్షుల విచారణ జరిగే అవకాశం ఉంది. అనంతరం నిందితుడికి కోర్టు శిక్షను ఖరారు చేయనుంది. మహిళలు, యువతులు పోలీసులు వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలపై అవగాహన పెంచుకోవాలి. స్మార్ట్ ఫోన్‌లలో యువత మహిళల రక్షణ కోసమే రూపొందించిన హాక్ ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవా లన్నారు. ఈ మేరకు అన్ని కళాశాలల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకు ంటున్నామన్నారు. మరోవైపు రాష్ట్రంలో యువతులు, మహిళలు, బాలిక లపై దారుణాలు నానాటికి పెరిగిపోతుండడంతో ప్రజల్లో ఆగ్రహం తారస్థాయికి చేరింది. రంగారెడ్డి జిల్లాలో దిశపై సామూహిక అత్యాచారం, హత్య, వరంగల్‌లో గాదం మానస అత్యాచారం, హత్యల నేపథ్యం, ముగ్గురు బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడి అతి దారుణంగా హత్యలు చేసిన నిందితుడు సైకో మర్రి శ్రీనివాస్‌రెడ్డికి శిక్ష పడడంలో జరుగుతున్న జాప్యంపై మండల ప్రజలు గుర్రుగా ఉన్నారు. మర్రి శ్రీనివాస్ రెడ్డికి ఇప్పటికే కఠిన శిక్షలు ఖారారు అయితేనైనా నేరం చేసే వారికి వెన్నులో వణుకు పుట్టేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఎవ్వరిని కదిలించినా సైకో శ్రీనివాస్ రెడ్డి దారుణాలనే గుర్తు చేసుకుంటు న్నారు. కొందరు మహిళలు కంటతడి పెడుతూ మర్రి శ్రీనివాస్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో యువతులపై జరుగుతున్న దారుణాలపై హాజీపూర్ గ్రామంలో ప్రజలందరూ శ్రీనివాస్‌రెడ్డి అకృత్యాలపై చర్చించుకుంటున్నారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టాలు కఠినంగా లేకపోవడంతోనే నేరాలు పెరుగుతున్నాయి. ఇతర దేశాల మాదిరిగా నేరం చేసిన వారికి తక్షణమే శిక్షలు పడే వ్యవస్థ రావాలి. కోర్టులు, పోలీసులు విచారణలంటూ జాప్యం చేస్తే చట్టంలో ఉన్న లోసుగులు నేరస్తులకు తప్పించుకునే వెసులుబాటు దొరుకుతుంది. హాజీపూర్ కేసులో నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డికి ఇప్పటికే శిక్ష పడితే ఇతర ప్రాంతాల్లో నేరం చేయాలనే వ్యక్తులకు కనువిప్పు కలిగేది.

జిల్లాలో పెరిగిన వరి దిగుబడులు

ధాన్యం కొనుగోళ్లకు పోటెత్తుతున్న రైతులు

కామారెడ్డి,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): కామారెడ్డి జిల్లాలో వరి దిగుబడి రికార్డు సృష్టించింది. పంట కాలాన్ని అనుసరించి అక్టోబర్ నెలాఖరులోగా జిల్లా వ్యాప్తంగా ధాన్యం రాబడులు ఒక్కసారిగా పోటెత్తాలి. ఆలస్యంగా నాట్లు వేయడంతో ధాన్యం రాక ఆలస్యం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు కాంటాలు ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటవుతుండడంతో రైతన్నలు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. కోత మిషిన్ల కొరత, కూలీల లభ్యత లేకపోవడమూ ధాన్యం రాకపై ప్రభావం చూపుతుందా అన్న అనుమానాలను రేకెత్తిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో పలు చోట్ల అకాల వర్షాలు వెంటాడుతుండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జోరుగా ధాన్యం కాంటాలు అవుతున్నాయి. వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు తూకం వేసి అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. తూకం అయిన బస్తాలను తక్షణమే ఎంపిక చేసిన రైసు మిల్లులకు లారీల్లో తరలిస్తున్నారు. మంచి దిగుబడులు రావడంతో కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాసులతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోలు చేసేందుకు 236 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో సాగునీటి వనరులు అంతగా లేకపోవడంతో రైతులు ఎక్కువగా వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది జిల్లాలో 1.75లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వానాకాలం సీజన్ ఆరంభంలో బోర్లు, వ్యవసాయ బావుల్లో తగినంత నీరు ఉన్న వారు మాత్రమే సాగుకు సిద్ధమయ్యారు. వానలు మొఖం చాటేయ్యడంతో కర్షకులు కాసింతగా ఆందోళన చెందారు. మొత్తం 236 కేంద్రాలను ఏర్పాటు చేయగా ఐకేపీ ఆధ్వర్యంలో 29, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో 207 కేంద్రాలున్నాయి. వానాకాలం సీజన్‌లో ధాన్యం పొటెత్తే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ముందు నుంచి యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఐదున్నర లక్షల టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో సన్న రకం ధాన్యం 60వేల టన్నులు కాగా వీటిని బయట మార్కెట్లోనే రైతులు ఇప్పటికే విక్రయించారు. దొడ్డు రకం ధాన్యాన్ని విక్రయించేందుకు జిల్లాలో రైతన్నలంతా ఎక్కడికక్కడ పోటెత్తుతున్నారు. అక్టోబర్‌లో ప్రారంభమైన కొనుగోళ్లు నవంబర్‌లో స్పీడు అందుకుంది. డిసెంబర్ మాసంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 41శాతం మాత్రమే ధాన్యాన్ని సేకరించగలిగారు. ఇంకా 59శాతం మేర ఇంకా ధాన్యాన్ని సేకరించాల్సి రావడం ఇటు పౌరసరఫరాల సంస్థకు, వ్యవసాయ శాఖకు సవాల్‌గా మారింది. ప్రైవేటు కొనుగోళ్ల జోరుగా సాగడం మూలంగానే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాకపై ప్రభావం పడుతుందా? అన్న సందేహం కలుగుతోంది. వానాకాలం సీజన్‌లో సాధారణ విస్తీర్ణానికి రెట్టింపు స్థాయిలో పంటలు సాగయ్యాయి. నాణ్యత ప్రమాణాల మేరకు కొనుగోలు చేస్తున్నారు. తేమ, తాలు తదితర నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. కొనుగోళ్లకు అవసరమయ్యే సదుపాయాలను సంబంధిత శాఖ సమకూర్చనుంది.

విపక్షాల తీరు మారాలి: ఎమ్మెల్యే

వరంగల్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చీఫ్‌విప్,ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపుకు చూడటం మనం గమనించాల్సిన అంశం అన్నారు. రైతులకు కొత్త ఏడాదిలో 24 గంటల పాటు వ్యవసాయానికి కరెంటు సరఫరా చేస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి అన్ని రంగాల్లో రాష్ట్రాని అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు సహకరించి, మంచి సలహాలు ఇవ్వాల్సింది పోయి, కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్నాయని అన్నారు. దీంతో ప్రాజెక్టులను, ఉద్యోగ నియామకాల్ని , ప్యాక్టరీలను రాకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడటం ఎంతవరు సమంజసమని అన్నారు. ఇటువంటి చర్యలతో ప్రతిపక్షాలు ప్రజలకు మరింత దూరమవుతున్నారన్నారు.

నాడు వరంగల్..నేడు షాద్‌నగర్
సాహో సజ్జన్నార్ అంటున్న నెటిజన్లు
ఎన్‌కౌంటర్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు

హైదరాబాద్,డిసెబర్6(ఆర్ఎన్ఎ): నాడు వరంగల్‌లోనూ..నేడు షాద్‌నగర్ ఘటనలోనూ హీరో సివి సజ్జన్నార్ అన్న విసయం గుర్తించాలి. తాజాగా షాద్‌నగర్ ఘటనలోనూ సజ్జన్నార్‌పై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వరంగల్ ఎన్÷–కౌంటర్‌లోనూ ప్రశంసలు వచ్చాయి.ఈ రెండు ఎన్‌కౌంటర్లు సజ్జనార్ నేతృత్వంలోనే జరగడంతో ఆయనపై ఇంటర్నెట్‌లో నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో సజ్జనార్ వరంగల్ ఎస్పీగా ఉన్నారు. ఆ సమయంలో వరంగల్‌లో ఇద్దరి విద్యార్థినులపై యాసిడ్ దాడి జరిగింది. ఘటనకు ఎస్ శ్రీనివాసరావు(25), పి. హరికృష్ణ(24), బి.సంజయ్(22) అనే ముగ్గురు యువకులను బాధ్యులుగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న 48 గంటల్లోనే పోలీసులు నిందితులను ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్ కూడా డిసెంబర్ నెలలోనే జరగడం గమనార్హం. నిందితులను ఘటనా స్థలికి తీసుకెళ్లిన సమయంలో పోలీసులపై నిందితులు దాడి చేసేందుకు ప్రయత్నించారని, యాసిడ్ చల్లేందుకు ప్రయత్నించారని... అందువల్లే ఆత్మరక్షణ కోసం పోలీసులు ఆ ముగ్గురిని కాల్చేశారని అప్పట్లో వరంగల్ ఎస్పీగా ఉన్న వీ.సీ.సజ్జనార్ వివరణ ఇచ్చారు. తాజాగా షాద్‌నగర్‌లో జరిగిన 'దిశ' ఘటన నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంపై మెజార్టీ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ సందర్భంగా వైఎస్ హయాంలో వరంగల్‌లో జరిగిన యాసిడ్ దాడి నిందితుల ఎన్‌కౌంటర్‌ను అందరూ గుర్తుచేసుకుంటున్నారు. ఇప్పుడు సజ్జన్నార్ సైబరాబాద్ కమిషనర్‌గా ఉన్నారు. ఈ రెండు ఘటనల్లో ప్రజలు సజ్జన్నార్ చర్యను సమర్థించడం విశేషం.'దిశ' ఘటనలో నిందితులను కూడా సైబరాబాద్ సీపీగా సజ్జనార్ ఉన్న సమయంలోనే ఎన్‌కౌంటర్ చేయడంతో 'సజ్జనార్.. ది ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్' అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా నిందితులు తప్పించుకునేందుకు యత్నించారని, తమపై రాళ్లు రువ్వారని.. ఆయుధాలు లాక్కునేందుకు యత్నించారని పోలీసులు చెప్పారు. ఆత్మరక్షణ కోసం నిందితులపై కాల్పులు జరిపినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఆరిఫ్, శివ, నవీన్, చెన్నకేశవులు మృతి చెందినట్లు చెప్పారు. దిశను కాల్చివేసిన ప్రాంతంలోనే నిందితుల ఎన్‌కౌంటర్ జరిగింది. తెల్లవారుజామున 3.30 నుంచి 5.30 మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమాచారం. పోలీస్ కస్టడీకి తీసుకున్న రెండో రోజే నిందితులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం గమనార్హం. నిజానికి ఈ రాక్షసులను పట్టుకున్న రోజే కాల్చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వచ్చింది. వరంగల్ లాగే ఇక్కడా ఎన్‌కౌంటర్ చేయండని సజ్జన్నార్‌ను ఆనాడే ప్రజలు కోరారు. అదే జరగడంతో ప్రజలు సమజంగానే ప్రశంసలు కురిపిస్తున్నారు.

కంది కొనుగోళ్లకు రంగం సిద్ధం
మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరలు

ఆదిలాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో కంది కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా పంటను కొనుగోలు చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, జైనథ్ మార్కెట్‌యార్డుల ద్వారా పంటను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దాదాపు రెండు లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది సైతం మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో కంది కొనుగోళ్లు చేశారు. వివిధ మార్కెట్‌యార్డుల్లో ఈ సంవత్సరం కంది కొనుగోళ్లకు ముందస్తుగా చర్యలు తీసుకోవడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలను విక్రయించే అవకాశం ఏర్పడింది.పంట దిగుబడులు ఎక్కువగా ఉండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందారు. ఈసారి సైతం మార్కెట్ యార్డుల్లో మార్క్‌ఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన రైతులు దళారుల బా రిన పడి నష్ట పోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వానాకాలం పత్తి, సోయాబీన్‌తో పాటు కంది పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం పత్తి,సోయా పంటల కొనుగో ళ్లు జరుగుతుండగా కంది దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉన్నాయి. కనీస మద్దతు ధర ప్రకటించగా రైతులకు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో రైతులు పత్తి, సోయాతో పాటు కంది పంటను అధికంగా సాగుచేస్తారు. పత్తి, సోయాల్లో అంతర పంటతో పాటు ప్రత్యేకంగా కందిని పండిస్తారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం కంది పంట సాగు విస్తీర్ణం తొమ్మిది వేల హెక్టార్ల వరకు తగ్గింది. ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణం సైతం కంది పంటకు అనుకూలించడంతో పంటి దిగుబడి ఆశాజనకంగా ఉంది. దళారుల బెడద ఎక్కువగా ఉంటోంది. దళారులు గ్రామాల్లోకి నేరుగా వెళ్లి పంటను కొనుగోలు చేస్తారు.

నిరుద్యోగులను వంచిస్తున్నారు

నిజామాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడమే కాకుండా ఇదేమని ప్రశ్నిస్తే

నిర్బంధాలు, అణచివేత విధానాలు కొనసాగిస్తోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా తప్పయ్యిందని, నిజాం పాలనను తలపించేలా నిర్బంధాలను కొనసాగిస్తున్నారని మండిప

కరదీపికలా స్టాటిస్టికల్ బుక్

అధికారులకు వినోద్ సూచన

కెసిఆర్ నిశిత పరిశీలకుడని కితాబు

హైదరాబాద్,డిసెంబర్ 6(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో సేకరించే గణాంకాల వివరాలు పక్కాగా, పకడ్బందీగా ఉండాలని, ఈ డేటా ప్రతి ఒక్కరికీ కరదీపికగా ఉపయోగపడేలా రూపొందించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. గురువారం నగరంలోని ఖైరతాబాద్ లోని ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుంచి సేకరించే అన్ని శాఖల గణాంకాలు ప్రభుత్వంతో సహా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి ఏడాది అసెంబ్లీ సమావేశాలకు ముందు స్టాటిస్టికల్ బుక్ రూపొందించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈసారి స్టాటిస్టికల్ 2020 ఇయర్ బుక్ ప్రభుత్వం చేపట్టే ఆయా కార్యక్రమాలకు దిక్సూచిగా ఉండేలా సిద్ధం చేయాలని వినోద్ కుమార్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి సమగ్ర డేటాను సేకరించాలని ఆయన అన్నారు. ఏదైనా అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించి, లోతైన విశ్లేషణతో, సంపూర్ణ అవగాహనతో సీఎం కేసీఆర్ పరిపాలనాపరమైన నిర్ణయాలు తీసుకుంటారని వినోద్ కుమార్ తెలిపారు. ఉద్యమ నేతగా అనేక అంశాలపై పరిశోధన చేసి, అపారమైన విషయ పరిజ్ఞానంతో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకునే ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్టాటిస్టికల్ 2020 ఇయర్ బుక్ సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 10,854 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 12,751 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయన్నారు. 33 జిల్లాలు, 141 మున్సిపాలిటీలతో పాటు 32 ప్రభుత్వ శాఖలు, 210 హెచ్ఓడీ విభాగాల డేటా పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కే. రామకృష్ణారావు మాట్లాడుతూ ఎ÷-లానింగ్ అండ్ స్టాటిస్టికల్ డిపా÷-టం÷-మెంట్ అధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమగ్రమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎ÷-లానింగ్ డైరెక్టర్ షేక్ మీరా, స్టాటిస్టికల్ డైరెక్టర్ ఏ. సుదర్శన్ రెడ్డి, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ ఏ డీ జే శ్రీనివాస్ రెడ్డి, నేషనల్ ఇంఫార్మటిక్ సెంటర్ (ఎన్ఐసి) డైరెక్టర్ శ్రీకాంత్ గోవర్ధనం, సేజిస్ ప్రతినిధి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకం - బైచుంగ్ భుటియా

గ్యాంగ్‌టక్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): వివాదాస్పద పౌరసత్వ సవరణ ముసాయిదా బిల్లు 'అత్యంత ప్రమాదాకారి' అని భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా(43) అన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి భారత్‌కు తరలి వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లుకు తాను పూర్తి వ్యతిరేకిని అని పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ ముసాయిదా బిల్లు సిక్కిం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేయలేదని సిక్కింకు చెందిన ఈ ఫుట్‌బాల్ దిగ్గజం అభిప్రాయపడ్డారు. 'బంగ్లాదేశ్‌కు దగ్గరగా ఉన్న కారణంగా ఇప్పటికే బెంగాల్, ఇతర ఈశాన్య రాష్ట్రాలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఇక సిక్కిం రాష్ట్రం కూడా బంగ్లాదేశ్‌కు చాలా దగ్గరగా ఉన్న కారణంగా దీర్ఘకాలంలో ప్రభావితమవుతుంది' అని 'హమ్రో సిక్కిం పార్టీ' అధినేత బైచుంగ్ భూటియా పేర్కొన్నారు. సిక్కిం క్రాంతికారి మోర్చా, బీజేపీ సారథ్యంలో నడుస్తున్న సిక్కిం ప్రభుత్వం.. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర ఈశాన్య బీజేపీ మిత్రపక్షాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అంతేకాక శాసనసభలో ఈ అంశానికి సంబంధించి తాను, తన పార్టీ వ్యతిరేకంగా వాదిస్తామన్నారు. సిక్కిం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు హమ్రో సిక్కిం పార్టీ సిద్ధంగా ఉందని, అవసరమైతే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు, ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసేందుకు సిద్ధమని బైచుంగ్ అన్నారు. సిక్కింలో ఆర్టికల్ 371 (ఎఫ్)లో సిక్కిం స్థబెట్ట్ యాక్ట్, రాజ్యాంగం ఉందన్నారు. కాగా ముస్లింలపై వివక్ష చూపేందుకు బీజేపీ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుందని, ఈ మతతత్వ బిల్లుకు వ్యతిరేకమని ప్రతిపక్షాలు వాదిస్తున్న విషయం తెలిసిందే.

మంటల్లో కాలిపోతున్నా వెరవని తెగువ

112కి ఫోన్ చేసిన ఉన్నావ్ బాధితురాలు

లక్నో,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా మహిళలపై వరుస హత్యాచార ఘటనలు, దాడులు ఆందోళన రేపున్నాయి. మరీ ముఖ్యంగా గత కొన్ని రోజులుగా పసిపిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా మహిళలపై నమోదవుతున్న అత్యాచార ఘటనలు మహిళ భద్రతను, రక్షణను సవాల్ చేస్తున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ అత్యాచార బాధితురాలిపై దాడిచేసి సజీవ దహనం చేసేందుకు ప్రయత్నించిన దారుణ ఘటన వెలుగు చూసింది. అయితే తనకు జరిగిన అన్యాయంపై ఇప్పటికే న్యాయ పోరాటం చేస్తున్న బాధితురాలు, గురువారం జరిగిన మరో దాడిలో కూడా చూపించిన తెగువ, సాహసం చర్చనీయాంశమైంది. తనే స్వయంగా పోలీసు ఎమర్జెన్సీ నెంబరు 112 ఫోన్ చేసింది. ఆమె ఫోన్ కాల్‌తోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అలాగే తనపై దాడిచేసిన వ్యక్తులు పేర్లను పోలీసులకు వెల్లడించింది. ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షి అందించిన కథనం ప్రకారం, మంటల్లో కాలిపోతూ కూడా దాదాపు కిలోమీటరు దూరం పరుగెత్తింది. సహాయం కోసం అర్థిస్తోంది. ఆమెకు సహాయం చేసేందుకు దగ్గరికెళ్లి ఆమెను పలకరించాను. తన పేరు చెప్పిన వెంటనే.. తన దగ్గరినుంచి ఫోన్ తీసుకుని పోలీసుల అత్యవర నంబరుకు కాల్ చేసిందని ఆయన చెప్పారు. ఆమె మంటల్లో కాలిపోతున్న ఆ దృశ్యం ఇప్పటికే తనను భయాందోళనకు గురిచేస్తోందన్నారు. ఇంతలో పోలీసులొచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించారంటూ ఈ దారుణాన్ని గుర్తు చేసుకున్నారు. కాగా అత్యాచార బాధితురాలు విచారణ నిమిత్తం రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా, ఇటీవల బెయిల్‌పై విడుదలైన నిందితులు దారికాచి, దగ్గర్లోని పొలంలోకి ఈడ్చుకెళ్లి మరి నిప్పంటించారు. ఈ ఘటనలో 90 శాతం కాలిన గాయాలతో ఆమె మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటనలో ఇద్దరు నిందితులు సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎయిర్ అంబులెన్స్ ద్వారా ఢిల్లీకి తరలించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం విమానాశ్రయం నుంచి సివిల్ ఆసుపత్రి వరకు గ్రీన్ కారిడార్‌కు ఏర్పాట్లు చేస్తోంది.

అమరావతి నిర్మాణంపై విభేదాలు

గల్లా ప్రసంగానికి అడ్డు తగిలిన వైకాపా ఎంపిలు

న్యూఢిల్లీ,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): రాజధాని అమరావతిపై టిడిపి వైకాపాల మధ్య విభేదాలు లోక్‌సభలోనూ ప్రస్ఫుటమయ్యాయి. అమరావతి వివాదంపై టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభలో మాట్లాడారు. అయితే గల్లా ప్రసంగానికి వైసీపీ ఎంపీలు అడ్డు తగిలారు. అమరావతిని ముంచి రాజధానికి వరద ముప్పు ఉందని ప్రభుత్వం చెప్పాలనుకుందని పార్లమెంట్‌లో గల్లా చెప్పుకొచ్చారు. వరద కారణంగా కృష్ణా జిల్లాలో పంట నీట మునిగిందని.. ఈ వరదలు పూర్తిగా మాన వ తప్పిదమేనని ఆయన చెప్పుకొచ్చారు. రాజకీయ దురుద్దేశంతో కావాలని ఈ విపత్తును ప్రభుత్వం సృష్టించిందన్నారు. ల్గ÷తుల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు మాత్రమే మాట్లాడుతూ వారికి సరైన న్యాయం చేయడం లేదని గల్లా జయదేవ్ వ్యాఖ్యానించారు. 'పంటనష్టం రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వ్యవసాయంలో అగ్రగామిగా ఉన్నా.. రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవటంలేదు. విపత్కర పరిస్థితుల్లో రైతులకు ఆత్మహత్యలే శరణం అనే పరిస్థితి నెలకొంది' అని గల్లా తెలిపారు.

మాకూ ఉపాధి కల్పించండి

-తాత్కాలిక ఆర్టీసీ సిబ్బంది వినతి

వరంగల్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఆర్టీసీ సమ్మె సమయంలో విధులు నిర్వహించిన తాత్కాలిక కండక్టర్లు, డ్రైవర్లు గురువారం వరంగల్‌లో ఆందోళనకు దిగారు. ఇప్పటికే కొందరు హైదరాబాద్‌లో ఆందోళన చేసి తమకు ఉపాధిచూపాలని కోరారు. తాజాగా ఇప్పుడు వరంగల్లో ఆందోళనచేశారు. తమకు సర్వీస్ సర్టిఫికేట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినప్పుడు.. విధులు నిర్వహించిన తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు కొత్తగా ఆందోళన బాట పట్టారు. చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో తాము విధుల్లో చేరామని, ఇప్పుడు సమ్మె విరమణతో తాము రోడ్డునపడ్డామన్నారు. తమకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని.. లేని పక్షంలో తాము పనిచేసిన రోజులకు సర్వీస్ సర్టిఫికేట్ ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే ఆర్టీసీలో ఖాళీలు ఉంటే తమకే ముందు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు వారు విజ్ఞప్తి చేశారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వైపు ప్రజల మళ్లింపు

నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేయత్నం

అంతర్జాతీయ స్థాయిలో రోడ్ల అభివృద్ధి

జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థ

మహిళల రక్షణకు మరిన్ని గట్టి చర్యలు

అధికారులతో మంత్రి కేటీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి ప్రజలను పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వైపు మళ్లించేందుకు రవాణా వ్యవస్థను మెరుగుపర్చనున్నట్టు మున్సిపల్‌శాఖ మంత్రి కె.టి. రామారావు తెలిపారు. ప్రజలుసొంత వాహనాలు వదిలి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించేలా సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామని అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలోని రోడ్లను వాహనాలు, పాద చారులు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు అనువుగా అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు. మెట్రో రైలు, ఎంఎంటిఎస్ మార్గాలు,స్టేషన్లు ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, లైనింగ్ సైకిల్‌వేలు, గ్రీనరీలను అభివృద్ధి చేస్తామని అన్నారు. గురువారం బుద్ధభవన్‌లో పోలీసు, జీహెచ్ఎంసి ఉన్నతాధికారులతో న్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ వ్యవస్థను శాస్త్రీయంగా క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు చేస్తామనాన్నారు. నగరంలోని ట్రాఫిక్‌సమస్యలకు ఎలక్ట్రిసిటీ, టీఎస్ ఐఐసి, జలమండలి వంటి శాఖలు కూడా సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థకు ఎక్కువ ఆదరణ ఉందని అన్నారు. ముంబయ్‌లో 72శాతం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగిస్తుంటే హైదరాబాద్‌లో 34శాతం మాత్రమే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ వ్యవస్థను సమన్వయం చేసేందుకు జీహెచ్ఎంసి పరిధిలో ప్రత్యేక ట్రాఫిక్ కమిషనరేట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్లలో వాహనాల సంఖ్య 73లక్షల నుంచి కోటి 20 లక్షలకు పెరిగినట్టు తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వైపుప్రజల్ని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని ఖాళీ ప్లాట్లను పార్కింగ్ ప్రదేశాలుగా ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ యాజమానుల అంగీకారాన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ స్థలాల్లో పార్కింగ్‌తో సంబంధిత స్థలాల యజమానులకు ఆదాయం సమకూరుతుందన్నారు. లే అవుట్ ఓపెన్ ప్లాట్లను ప్రజా ప్రయోజనార్థం పబ్లిక్‌టాయిలెట్లు, బస్‌షెల్టర్లు, స్కైవాక్ వేలను , గ్రీనరీలకు వినియోగించనున్నట్టు తెలిపారు. రోడ్ల అభివృద్ధిలో భాంగా 709 కి.మీ. ప్రధాన రహదారులను సిఆర్ఎంపి కింద తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి సిఆర్ఎంపి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్‌కమిషనర్లను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఐదు సంవత్సరాలపాటు పూర్తిగా ఆయారోడ్లను నిర్వహించే బాధ్యత సంబంధిత ఏజెన్సీలదేనని మంత్రి స్పష్టంచేశారు. పైప్‌లైన్లు, కేబుళ్ల , డ్రైనేజీ తవ్వకాలు, మరమ్మతులను సంబంధిత ఏజెన్సీల ద్వారానే చేపట్టాల్సి ఉంటుందన్నారు. తవ్వకాలు, మరమ్మతులతో పాటు పునరుద్ధరణ పనులను కూడా సిఆర్ఎంపి ఏజెన్సీనే చేస్తోందని తెలిపారు. ఏజెన్సీలు చేపట్టే పనులకు ప్రభుత్వం, జీహెచ్ఎంసి, పోలీసుయంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందని అన్నారు. కమర్షియల్ ఏరియాల్లో ఉన్న సెట్‌బ్యాక్ స్థలాన్ని కూడా ఫుట్‌పాత్‌లకు వినియోగించనున్నట్టు తెలిపారు. మహిళల భద్రత పై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు మంత్రి కేటీఆర్ సూచించారు. నగరంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 100కు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వైన్‌షాపులు, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత వైన్‌షాపులను మూసివేయించాలన్నారు. పార్కులు, ఖాళీ స్థలాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మార రాదన్నారు. నగరంలో 4లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అన్ని రోడ్లపై లైటింగ్‌ను పెంచేందుకు అదనంగా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసి ద్వారా మహిలల భద్రతకు చేపట్టిన అవగాహన సదస్సులు, పబ్లిసిటీ కార్యక్రమాలను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్ల నిర్వహణపై సిఆర్ఎంపి ఆలోచన గత 25 సంవత్సరాల క్రితమే తనకు వచ్చిందన్నారు. ప్రభుత్వం ఈ విధంగా పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు సౌకర్యవంత మైన రవానా సదుపాయాలు , రోడ్లు ఉంటే ట్రాఫిక్ సమస్య ఉండదని అన్నారు. అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్నదేశంల్లో రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ పనులను ట్రాన్స్‌పోర్ట్ విభాగమే చూస్తుందన్నారు. ఈ సమావేశంలో మేయర్‌బొంతు రామ్మోహన్, మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, జీహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరవ్ మోడీ ఆర్థిక నేరస్తుడు

- ఆస్తుల జప్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం

- స్పష్టం చేసిన ముంబయి కోర్టు

ముంబయి, డిసెంబర్6(ఆర్ఎన్ఎ) : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటిస్తూ ముంబైలో ప్రత్యేక కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. పరారీ ఆర్థిక నేరగాళ్ల చట్టం కింద అక్రమ లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. భారత కోర్టుల పరిధికి వెలుపల ఉంటూ విచారణ నుంచి తప్పించుకు తిరుగుతున్న ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు 'పరారీ ఆర్థిక నేరగాళ్ల చట్టం' అనుమతిస్తుంది. కాగా నీరవ్ మోదీ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని పీఎంఎల్ఏ కోర్టు పేర్కొంది. ప్రస్తుతం నీరవ్ మోడీ లండన్ జైలులో ఉన్నాడు. ముంబైలోని ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కోర్టు నీరవ్‌ను ఆర్థిక నేరగాడిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజయ్ మాల్యా తర్వాత ఆర్థిక నేరస్తుడనే ముద్ర పడిన రెండవ వ్యక్తిగా నీరవ్ మోడీ నిలిచాడు. గతేడాది పార్లమెంటులో ఆర్థిక నేరగాళ్లపై కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆర్థిక నేరస్తులుగా ఒక వ్యక్తిపై ముద్ర పడితే అతని ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కును విచారణ సంస్థలకు ఈ చట్టం కల్పిస్తుంది. అంతేకాదు విచారణకు హాజరుకాకుండా విదేశాలకు పారిపోయే వారి ఆస్తులను కూడా అటాచ్ చేసేందుకు విచారణ సంస్థలకు అన్ని అధికారాలను కట్టబెడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. నీరవ్ మోడీ, అతని మామ మెహుల్ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కామ్‌లో ప్రధాన నిందితులుగా ఉన్నారు. తప్పుడు ధృవపత్రాలు చూపించి రుణాలు పొందారు. ఎప్పుడైతే ఈ కుంభకోణం వెలుగు చూసిందో ఇక అప్పటి నుంచి ఇద్దరు పరారీలో ఉన్నారు. గతేడాది జనవరిలో ఇద్దరు నిందితులు దేశం వీడి పారిఎయారు. దీంతో సీబీఐ ఈ కేసును విచారణ చేయడం ప్రారంభించింది. ఇదిలా ఉంటే నీరవ్ మోడీ, చోక్సీలు ఇద్దరూ తమపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని చెప్పుకొచ్చారు. తన క్లయింట్ అయిన నీరవ్ మోడీపై భారత ప్రభుత్వం నేరగాడు అనే ముద్ర వేస్తోందని లాయర్ హ్యూగో కీత్ చెప్పాడు

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తాం

ఇది భారత్ విధానాలకు వ్యతిరేకం

ఆర్థిక పరిస్థితిపై ప్రధాని బింకాలు: రాహుల్

తిరువనంతపురం,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): కేంద్ర కేబినెట్ ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో అణచివేతకు గురై భారత్‌లో ఆశ్రయం కోరుతున్న వారి కోసం తీసుకొచ్చిన 'పౌరసత్వ సవరణ బిల్లు'కు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్ మరో రెండు రోజుల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం కల్పించేందుకు తీసుకొచ్చిన ఈ సవరణ బిల్లును రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన మరుసటి రోజునే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేరళలోని కొలికోడ్‌లో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) నేతృత్వంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ భాజపాపై విమర్శనాస్త్రాలు సంధించారు. 'ఈ దేశంలో ఎవరినైనా ఎలాంటి వివక్ష చూపించినా కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. అందులోనూ భారతీయులపై వివక్ష చూపిస్తే సహించేది లేదు. అలా వివక్ష చూపించే వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. ఇది మా సిద్ధాంతం. భారత్ ప్రతిఒక్కరికి చెందినదని మేం విశ్వసిస్తున్నాం. ఈ దేశంలోని అన్ని వర్గాలు, మతాలు, సంస్కృతులు భారత్‌లో అంతర్భాగమే' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన అనంతరం పలు రాజకీయ పార్టీల నేతల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇది పూర్తిగా మతతత్వ చర్యగా మరికొందరు అభివర్ణిస్తున్నారు. మరోవైపు తనపై నమోదైన పలు కేసుల గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు రాహుల్ గాంధీ స్పందించారు. తనపై 15 నుంచి 16 కేసులు నమోదు చేశారని.. ప్రతి కేసు తనకొక పతకం లాంటిదని అన్నారు. అలాంటి వాటికి భయపడి వెనకడుగు వేసేదిలేదని స్పష్టం చేశారు. ప్రతి కేసును ఎదుర్కొంటానని తెలిపారు. ఇకపోతే దేశ ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగోలేదని కేంద్ర ఆర్థిక వ్యవస్థపై రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. దేశ పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా మోదీ,షా తమ సొంత ప్రమల్లో బతుకుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గమైన వయనాడ్‌లో రాహుల్ పర్యటిస్తున్నారు. దేశంలో ఎలాంటి ఆర్థిక సంక్షోభం లేదన్న బీజేపీ ప్రచారంపై ఆయన భగ్గుమన్నారు. తమ సొంత భ్రమల్లో మోదీ,షా బతుకుతున్నారు. వారికి బయటి ప్రపంచంతో ఏమాత్రం సంబంధం లేదు. వారు తమ సొంత ఊహల్లో బతుకుతున్నారు. అందుకే దేశం ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో ఉందని ఆరోపించారు. ప్రజల బాగోగులను, సమస్యలను ప్రధాని సావధానంగా వింటే దేశంలో ఎలాంటి సమస్యా తలెత్తదని, వారు భ్రమల్లో బతుకుతూ, దేశ ప్రజల్నీ అలాగే బతకమని చెబుతున్నారని రాహుల్ మండిపడ్డారు.

చిదంబరం షరతులను ఉల్లంఘించారు

బెయిలుపై ఉన్నవారు స్వాతంత్ర్య సమరయోధులు కాదు

కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్

న్యూఢిల్లీ, డిసెంబర్6(ఆర్ఎన్ఎ) : బెయిల్‌పై బయటకు వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం షరతులు ఉల్లంఘించారని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. ఎస్ఎక్స్ మీడియా కేసులో చిదంబరానికి సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో ఆయన బుధవారం తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసు గురించి బహిరంగంగా మాట్లాడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అయితే చిదంబరం జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా తన రికార్డు స్వచ్ఛంగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రకాశ్ జవదేకర్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ చిదంబరం బెయిలు షరతులను ఉల్లంఘించారని చెప్పారు. చిదంబరానికి వ్యతిరేకంగా నమోదైన ఈ కేసు కేంద్ర మంత్రిగా ఆయన పని చేసిన కాలంలో అవినీతికి సంబంధించినదేనని గుర్తు చేశారు. అటువంటి నేపథ్యంలో కేంద్ర మంత్రిగా తన రికార్డు స్వచ్ఛంగా ఉందని చెప్పడం ద్వారా ఆయన బెయిలు షరతులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. తాను బహిరంగంగా ఎటువంటి స్టేట్‌మెంట్లు ఇవ్వబోనని బెయిలు ఇచ్చినపుడు చిదంబరం సుప్రీంకోర్టుకు తెలిపారన్నారు. ఇప్పుడు కేంద్ర మంత్రిగా తన రికార్డు స్వచ్ఛంగా ఉందన్నారని, కేసు దాని గురించేనని చెప్పారు. ఇది స్వీయ ధ్రువపత్రం ఇచ్చుకోవడమేనని చెప్పారు. కొందరు కాంగ్రెస్ నాయకులు బెయిలుపై విడుదలయ్యారని, వారు స్వాతంత్ర్య సమర యోధులు కాదని జవదేకర్ అన్నారు.

ఆకర్షణీయ నగరాల్లో ఏడు భారత పట్టణాలు

గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్ కంపెనీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ,డిసెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా 100 ఆకర్షణీయ ప్రదేశాల్లో భారత్‌కు చెందిన ఏడు నగరాలకు చోటు లభించింది. యూకేకు చెందిన గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్ కంపెనీ యూరోమానిటర్ ఇంటర్నేషనల్ స్టేట్స్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారత్. చారిత్రక, సాంస్కృతిక వారసత్వం, భిన్నత్వంలో ఏకత్వం, అందుబాటులో ధరలు వంటి పలు అంశాలు ఆయా నగరాలకు సానుకూలతగా ఉన్నాయి. మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ విమానాశ్రయం, లగ్జరీ, మెడికల్, స్పోర్ట్స్, కల్చర్ టూరిజం వంటి అంశాలు ఆయా నగరాలకు జాబితాలో స్థానం దక్కేందుకు దోహదంగా ఉన్నాయి. టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్న ఏడు నగరాల వివరాలిలా ఉన్నాయి. దేశ రాజధాని నగరం ఢిల్లీ 11వ స్థానంలో.. దేశ ఆర్థిక రాజధాని నగరం ముంబయి 14వ స్థానంలో.. ప్రేమికుల చిహ్నాన్ని మదిలో పొదువుకున్న ఆగ్రా నగరం 26వ స్థానంలో.. తమిళనాడు రాజధాని నగరం చెన్నై 31వ స్థానంలో.. పింక్ సిటీ జైపూర్ 34వ స్థానంలో.. పశ్చిమబెంగాల్ రాజ ధాని కోల్‌కతా నగరం 74వ స్థానంలో.. కర్ణాటక రాజధాని నగరం బెంగుళూరు 100వ స్థానంలో ఉన్నాయి. 24 గంటలకు మించి అదే విధంగా ఏడాదికి తగ్గకుండా పర్యాటకులు ఆయ

రక్షణ చట్టాలు ఇంకా కఠినంగా ఉండాలి

-ఎన్‌కౌంటర్‌పై పవన్ కళ్యాణ్

హైదరాబాద్,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): దిశ ఉదంతం ఆడపడుచుల రక్షణకు ప్రస్తుతం ఉన్న చట్టాలు సరిపోవని హెచ్చరిస్తోందని వెల్లడించారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. దిశా నిందితుల ఎన్ కౌంటర్‌పై ఆయన స్పందించారు. ఈమేరకు ట్విటర్‌లో ఓ ప్రకటన విడుదల చేశారు. నలుగురు ముష్కరుల మధ్య దిశ ఎంత నరకాన్ని చూసిందో తలచుకుంటే ఆవేశం, ఆక్రోషం, ఆవేదనతో శరీరం ఉడికిపోతోందన్నారు. జాతి యావత్తు తక్షణ న్యాయం కోరుకోవడానికి కారణం ఈ ఆవేదనే అన్నారు. దిశ సంఘటన ముగిసిందని దీనిని ఇంతటితో వదిలిపెట్టకూడదని, మరే ఆడబిడ్డకు ఇలాంటి పరిస్థితి రాకూడదని పవన్ అన్నారు. నిర్భయ ఉదంతం తరువాత బలమైన చట్టాన్ని పార్లమెంట్ తీసుకొచ్చిందనే విషయాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. అయినా కూడా అత్యాచారాలు ఆగడం లేదని, ఇంకా కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని జరుగుతున్న సంఘటనలు చెబుతున్నాయన్ని వెల్లడించారు. ఇతర దేశాలలో ఎలాంటి చట్టాలున్నాయో..అధ్యయనం చేయాలని, వేధాపులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కేసులలో కోర్టుల పరంగా తక్షణ న్యాయం లభించాలని, రెండు, మూడు వారాల్లోనే శిక్షలు పడేలా నిబంధనలు రావాలన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా దిశ ఉదంతంలో సత్వర న్యాయం లభించిందని, దిశ ఆత్మకు శాంతి కలగాలని, విషాదం నుంచి ఆమె తల్లిదండ్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు పవన్ వెల్లడించారు.

దిశా హత్యకేసు నిందితులని ఎన్‌కౌంటర్ చేయడం పట్ల పూరీ జగన్నాథ్ స్పందించారు. సెల్యూట్.. తెలంగాణ పోలీస్ డిపార్టుమెంటుకి చేతులెత్తి మొక్కుతున్నాను. మీరే మా రియల్ హీరోస్ . నేనెప్పుడు ఒక విషయాన్ని నమ్ముతాను. మనకి కష్టమొచ్చిన కన్నీళ్లొచ్చినా పోలీసోడే వస్తాడు . నువ్వే దిక్కు రక్షించాలని దేవుడికి మొక్కినా ఆ దేవుడు కూడా పంపించేది పోలీసోడినే అంటూ పూరీ తన ట్వీట్‌లో పేర్కొన్నాడు.దిషాకు న్యాయం చేయడం ఇక్కడ ఆగొద్దు . బాల్యం నుండి విద్య, సాధికారత మరియు జ్ఞానోదయం ద్వారా ఇటువంటి ఘోరమైన నేరాలను నిరోదించాలి. జైహింద్. ఇప్పుడు దిశ ఆత్మ శాంతిస్తుంది అని రవితేజ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

మావోల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్6 (ఆర్ఎన్ఎ):మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్‌దత్ అన్నారు. స్టేషన్ల పరిధిలోని గొత్తికోయ ప్రాంతాలను సందర్శిస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అధికారులంతా కృషి చేయాలని తెలియజేశారు.ఏజెన్సీ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తమ తమ పోలీస్ స్టేషన్లకు అవసరమైన రక్షణకు సంబంధించి అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసుకొని కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతకు అన్ని విభాగాల్లో ప్రోత్సాహం అందించాలని కోరారు. జిల్లాలోని ఏజెన్సీ పోలీస్ స్టేషన్లలో పనిచేసే అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్ అధికారులకు ఆయన సూచనలు చేశారు. అలాగే సంఘవిద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్రోహశక్తుల సమాచారం సేకరించేవిషయంలో చాకచక్యంగా వ్యవహరించాలన్నారు.

తెలంగాణ పోలీసులపై దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు

హైదరాబాద్,డిసెంబర్ 6(ఆర్ఎన్ఎ): దిశ హంతుకులను ఎన్‌కౌంటర్ చేయడంతో తెలంగాణ పోలీసుల తీరుపట్ల దేశవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తుంది. తెలంగాణ పోలీస్ సెల్యూట్ అంటూ దేశంలోని ప్రముఖులు పేర్కొంటున్నారు. తెలంగాణ పోలీస్‌లనుచూసి మిగిలిన రాష్ట్రాల పోలీసులు నేర్చుకోవాలంటూ పలువురు హితవులు పలుకుతున్నారు. మరోవైపు మహిళలు నిందితుల ఎన్‌కౌంటర్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ పోలీసులకు హ్యాట్సాఫ్- ఎమ్మెల్యే రాజాసింగ్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్య కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడం శుభపరిణామమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. భారతదేశంలో మహిళలపై ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారికి ఈ విధంగానే శిక్ష వేయాలని కోరారు. తెలంగాణ పోలీసులను ఎంతో మంది తిట్టారు. అందులో నేనూ ఒకడిని. నిందితులను ఎన్‌కౌంటర్ చేసినందుకు పోలీసులకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని అన్నారు. తెలంగాణ పోలీసులను చూసి ప్రతిఒక్క రాష్ట్రం నేర్చుకోవాలని, దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో అత్యాచారాలు జరుగుతున్నాయని, ప్రతి రాష్ట్రంలోని పోలీసులు ఈ విధంగా ముందుకెళ్తే మహిళలపై దౌర్జన్యాలు ఆగిపోతాయని రాజాసింగ్ అన్నారు. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విచారణ చెయ్యాలంటున్నారని, కానీ ఏ విచారణ అవసరం లేదని రాజాసింగ్ పేర్కొన్నారు. తెలంగాణ పోలీసులు భయపడనవసరం లేదని, యావత్ భారతదేశం మీ వెంట ఉంది అని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

నేను పోలీస్ కానందుకు బాధపడుతున్నా - మంత్రి పువ్వాడ

దిశ హత్యాచార నిందితుల ఎన్‌కౌంటర్‌తో ఆమె ఆత్మ శాంతిస్తుందని తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ పేర్కొన్నారు. ఆడపిల్లలపై కన్నెత్తి చూస్తే కళ్లు పీకి చూపిస్తామన్న మాటలు తూటాలై తగిలాయని ఆయన అన్నారు. తాను పోలీస్ కానందుకు బాధపడుతున్నట్లు చెప్పారు. సత్వర న్యాయంలో తెలంగాణ మన దేశంలోనే నంబర్ వన్ అని మరోసారి నిరూపితమైందని అజయ్ వెల్లడించారు.

హైదరాబాద్ పోలీసులకు సెల్యూట్ - క్రీడాకారిణి సైనానెహ్వాల్

దిశ హత్యాచారం కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన హైదరాబాద్ పోలీసులకు సైనా నెహ్వాల్ సెల్యూట్ చేశారు. హైదరాబాద్ పోలీసులు మంచి పని చేశారు అని సైనా అభినందించారు. దిశపై అత్యాచారం చేసి అత్యంత దారుణంగా చంపిన నిందితులు ఆరిఫ్, నవీన్, శివ, చెన్నకేశవులును పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడాన్ని సైనా నెహ్వాల్ అభినందిస్తూ ట్వీట్ చేశారు.

తెలంగాణ పోలీస్ ఎన్‌కౌంటర్‌ను సమర్థిస్తున్నా - ఏపీ మంత్రి అవంతి

'దిశ' హత్య కేసులో నలుగురు నిందితులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని ఆడపిల్ల తండ్రిగా సమర్థిస్తున్నట్లు ఏపీ మంత్రి అవంతి శ్రీనివాస్ వెల్లడించారు. ఇకపై ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఆడపిల్లలకు మార్షల్స్ ఆర్ట్స్ నేర్పించాలన్నారు. దిశకు జరిగిన అన్యాయం ఏ ఆడపిల్లకు జరగకూడదని భావోద్వేగం చెందారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను మార్చి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పురుషుడు మహిళలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ పోలీసుల్ని చూసి నేర్చుకోండి - మాయావతి

తెలంగాణ పోలీసులను చూసి మిగిలిన రాష్ట్రాల పోలీసులు నేర్చుకోవాలంటూ ఎన్‌కౌంటర్‌ను బీఎస్పీ అధినేత్రి మాయావతి సమర్థించారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, పోలీసులపై ఆమె విమర్శలు గుప్పించారు. తమ రాష్ట్రంలో నేరాలు పెరిగిపోతున్నప్పటికీ సర్కారు నిద్రపోతోందని దుయ్యబట్టారు. శుక్రవారం ఆమె రేఖా శర్మ చెప్పారు.

ఎన్‌కౌంటర్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు

మీడియాతో మాట్లాడుతూ... ఉత్తర్ ప్రదేశ్‌లో మహిళలపై నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, కానీ, రాష్ట్ర ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకోకుండా మొద్ద నిద్రపోతోందని విమర్శించారు. హైదరాబాద్ పోలీసులను చూసి ఉత్తరప్రదేశ్, ఢిల్లీ పోలీసులు నేర్చుకోవాలని ఆమె సూచించారు. అయితే, యూపీలో మాత్రం దురదృష్టవశాత్తూ నేరగాళ్లను అతిథులుగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో జంగల్ రాజ్ కొనసాగుతోందని మాయావతి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి యుగంలో దేవుడు అవతరిస్తాడు - ఏపీ హోంమంత్రి సుచరిత

నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత ట్విట్టర్‌లో స్పందించారు. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్. ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అంటూ భగవద్గీతలోని శ్లోకాన్ని ప్రస్తావించారు. 'సజ్జనుల సంరక్షణార్థమూ, దుష్టజన శిక్షణకూ, ధర్మసంస్థాపన కోసం.. ప్రతి యుగంలోనూ నేను అవతరిస్తూనే వుంటాను'అంటూ శ్రీకృష్ణుడు ఈ శ్లోకాన్ని చెప్పారు. పాపాలు పెరిగినప్పుడు, అన్యాయం జరిగినప్పుడు.. ధర్మాన్ని నిలబెట్టడానికి ప్రతి యుగంలో దేవుడు అవతరిస్తాడు అంటారు.

దేశ సామాన్య పౌరురాలిగా సంతోషంగా ఉంది - రేఖా శర్మ

దిశ హత్యాచార కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంపై జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖా శర్మ స్పందించారు. నలుగురు నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంతో దేశ సామాన్య పౌరురాలిగా సంతోషంగా ఉన్నానని ఆమె తెలిపారు. దేశ ప్రజలు ఎలాంటి ముగింపు అయితే కోరుకున్నారో అదే జరిగిందన్నారు. దిశ నిందితులను ఎన్ కౌంటర్ చేసిన పోలీసులు మంచి న్యాయనిర్ణేతలు అని ఆమె పేర్కొన్నారు. నిందితులకు ఉరిశిక్ష విధించాలని తాము కోరుకున్నామని, కానీ ఎన్ కౌంటర్ చేయడం కూడా మంచిదే అని రేఖా శర్మ చెప్పారు.

భగవంతుడే పోలీసుల రూపంలో శిక్షించాడు - బాలయ్య

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సినీ నటుడు, తెదేపా ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించారు. పోలీసులకు, తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. భగవంతుడే పోలీసుల రూపంలో దిశ నిందితులకు సరైన శిక్ష విధించాడు, మరొకసారి ఎవరూ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా, అసలు అటువంటి ఆలోచనే మొలకెత్తనివ్వకుండా అందరికీ ఇదొక గుణపాఠం కావాలని అన్నారు. దిశ ఆత్మకు ఇప్పుడు శాంతి చేకూరిందని బాలకృష్ణ తెలిపారు. పొల్యూషన్ నుంచి అయినా తప్పించుకోవచ్చు కానీ పోలీసుల నుంచి ఎవరూ తప్పించుకోలేరు.. అందుకు ఇవాళ్టి ఎన్‌కౌంటరే ఉదాహరణ సినీదర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు.

తెలంగాణ ప్రజలకు ఇదే అసలైన దీపావళి - ఏపీ మంత్రి తానేటి వనిత

తెలంగాణ ప్రజలకు ఇదే అసలైన దీపావళి అని ఏపీ మంత్రి తానేటి వనిత వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు ఎన్‌కౌంటర్‌తో నిందితులు చనిపోయారని.. చనిపోయిన దిశను తీసుకురాలేకపోయినా బాధితురాలి తల్లిదండ్రులకు కాస్తైనా ఊరట లభించిందని అభిప్రాయపడ్డారు. దిశ కేసులో లాయర్లు కూడా నిందితుల తరపున వాదించడానికి ముందుకు రాలేదని.. ఎవరైనా ఆడవాళ్లజోలికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండాలన్నారు. దిశ కేసు నిందితులకు సరైన శిక్ష పడిందని.. 2012లో నిర్భయ ఘటన తర్వాత పోక్సో చట్టం ప్రవేశపెట్టినా అది సరిగా అమలు కాకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. నిర్భయ కేసులో నిందితులు జైల్లోనే ఉన్నారని.. ఇలాంటి నిందితులకు మరణశిక్ష విధించాలని దేశం ముక్తకంఠంతో నినదిస్తోంది అన్నారు. మరోవైపు ఇలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు ఏపీలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని.. అలాగే జీరో ఎఫ్ఐఆర్‌తో పాటూ మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు

కేసీఆర్ ముందుచూపుతో హరితహారం

గ్రీన్‌ఛాలెంజ్‌తో ప్రజల్లోనూ చైతన్యం

మహబూబాబాద్,డిసెంబర్6 (ఆంఎన్ఎ): సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా హరితహారం కార్యక్రమాన్ని ఐదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గుర్తు చేశారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం కోట్ల మొక్కలు నాటిస్తున్నట్లు గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ చాలెంజ్ విజయవంతంగా కొనసాగుతుందన్నారు. గ్రీన్ చాలెంజ్‌లో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... హరితహారంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ చాలెంజ్‌కు దేశ వ్యాప్తంగా మంచి స్పందన వస్తుందన్నారు. పల్లెలన్నీ పచ్చటి వనాలుగా మారాలని సీఎం కేసీఆర్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి మిగతా వారికి చాలెంజ్ చేస్తూ మొక్కలు నాటించి వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 30రోజుల ప్రగతి ప్రణాళిక పనులుతో ఊర్లన్నీ క్లీన్‌అండ్ గ్రీన్‌గా మారాయన్నారు. చెట్లు ఉంటనే వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ఏ ఊరి నర్సరీలోని మొక్కలు ఆ ఊళ్లోనే నాటేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఇదిలావుంటే జిల్లా అధికారులు సమిష్టిగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అన్ని గ్రామాల్లో బహిరంగ మల విసర్జన చేయకుండా మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పండ రోజులు పనులను కల్పించాలన్నారు. ప్రధానంగా ఈ వ్యవసాయ సీజన్‌లో రైతులు పండించిన పంటలకు ప్రభు త్వం కల్పిస్తున్న మద్దతు ధరలపైన అవగాహన కల్పించాలని, రైతులు తమ పంటలను దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే విధంగా జిల్లా అధికారులు చైతన్యం తీసుకురావాలన్నారు.

హరితహారం మొక్కలు చిగురించేలా చేయాలి: కలెక్టర్

కామారెడ్డి,డిసెంబర్6(ఆర్ఎన్ఎ): నూతన పంచాయతీ రాజ్ చట్టంపై సర్పంచులు, గ్రామ పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. హరితహారంలో నాటిన మొక్కల్లో 85 శాతం బతికేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ శాఖ అధికారులకు సూచిం చారు. మొక్కలు ఎండిపోయిన స్థానంలో నూతన మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్పెషల్‌డ్రైవ్‌గా చేపట్టి ఈ నెల 12వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 7వ తేదీలోగా డివిజన్‌కు 100 ట్రాక్టర్ల చొప్పున కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. నర్సరీ ఏర్పాట్ల పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు ఇందుకు అనుగుణంగా సాగాలన్నారు. నర్సరీల ఏర్పాటు, హరితహారం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డు పనులపై సమీక్షించారు. నర్సరీల ఏర్పాటుకు సంబంధించి బోర్డు, గేట్, క్యాటర్ ట్రాప్, ఫెన్సింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు.

మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి ఆసరా

2లక్షల చెక్కు...కుమారుడికి ఉద్యోగ నియామకం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందచేత

మహబూబాబాద్,డిసెంబర్6 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు సురేశ్ కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు చెక్కును ఎమ్మెల్యే శంకర్ నాయక్ అందించారు. సరేశ్ కుమారుడైన శ్రీకాంత్‌కి ఉద్యోగ నియమక పత్రాన్ని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆవరణలో అధికారులతో కలిసి అందజేశారు. ఆర్టీసీ కార్మికులకు సిఎం కెసిఆర్ ఎప్పుడూ అండగాఉంటారని అన్నారు. ఇదిలావుంటే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని అన్నారు. అయితే రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరలను అందిస్తుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ము కోవాలన్నారు. ఏ గ్రేడ్ వరిధాన్యానికి రూ. 1,835, రెండోరకం ధాన్యానికి రూ. 1,815 మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలో ఉన్న చెరువులు మొత్తం నిండి రెండో పంటకు కూడా సరిపడే నీరు ఉందన్నారు. రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.రైతులందరూ ప్రభుత్వ మద్దతు ధరను పొంది అభివృద్ధి చెందాలని అన్నారు. రైతులను ఆదుకునేందుకే ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని తెలిపారు.చెత్తా, చెదారం, తాలు, మట్టి పెల్లలు లేకుండా తేమ శాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని విక్రయానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.

సీపీ సజ్జనార్ చిత్రపటాలకు పాలాభిషేకాలు!

సెల్యూట్ సజ్జనార్, తెలంగాణ పోలీస్ అంటూ హర్షం

హైదరాబాద్, డిసెంబర్6(ఆర్ఎన్ఎ) : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన వెటర్నరీ డాక్టర్ దిశ హత్యకేసులో నిందితులు ఎన్‌కౌంటర్ అయ్యారు. శంషాబాద్ సమీపంలో చటాన్ పల్లి దగ్గర నలుగుర్ని కాల్చి చంపారు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే క్రమంలో పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు కాల్పులు జరపడంతో నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. నిందితులకు సరైన శిక్ష పడిందంటూ ట్వీట్లు, పోస్టులు ట్రెండ్ అవుతున్నాయి. సీపీ సజ్జనార్ పేరు సోషల్ మీడియాలో హోరెత్తుతోంది. ఈ ఘటన తర్వాత సోషల్ మీడియాలో తెలంగాణ పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తెలంగాణ పోలీసులు మంచి పనిచేశారంటూ నెటిజన్లు ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన జరిగిన తర్వాత పోలీసుల నిర్లక్ష్యంపై మండిపడిన వారే ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తెలంగాణ పోలీసులు, సీపీ సజ్జనార్ పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. జై పోలీస్.. జై జై తెలంగాణ పోలీస్ అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్వీట్ చేస్తున్నారు. సీపీ సజ్జనార్‌కు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద క్రేజ్ వచ్చింది. సజ్జనార్‌పై అభిమానంతో కొందరు పాలాభిషేకం చేశారు. దిశ కుటుంబానికి సరైన న్యాయం చేశారంటున్నారు. హైదరాబాద్‌తో పాటూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయనపై ప్రశంసలు కురిపిస్తున్నారు. సెల్యూట్ సజ్జనార్, తెలంగాణ పోలీస్ అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎక్కడ విన్నా సీపీ సజ్జనార్ పేరే మార్మోగుతుంది.ఇదే సందర్భంలో 2008లో జరిగిన యాసిడ్ దాడి నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ దిశ హత్యకేసులో అదే సీన్ రిపీట్ అయ్యిందంటున్నారు. రెండు ఘటన ల్లోనూ సజ్జనార్ కీలక బాధ్యతల్లో ఉన్నారని.. అప్పుడు వరంగల్ ఎస్పీగా.. ఇప్పుడు సైబ రాబాద్ సీపీగా ఆయనే ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఇటు పోలీసులు మాత్రం చట్టం తన పని తాను చేసుకొని పోతుందంటున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పిలుపు

మెదక్,డిసెంబర్6(నేటినిజం ప్రతినిధి) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్న రోజే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అన్ని గ్రామాలు స్వచ్ఛత వైపు పయనిస్తున్నాయని, ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుంటామన్నారు.

గ్రామస్తులు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. గ్రామస్తులు విధిగా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టి వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. పాఠశాలలతో పాటు ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించారు.

పాఠశాల సిబ్బంది చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు జరిగిన తర్వాతే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా అమలు జరుగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ పథకాలు కార్యాచరణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులు నష్టపోకూడదనే తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా చూడటం కోసం గానూ ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటుధర అందజేస్తుందన్నారు. రైతులు ఆర్థికంగా బాగుపడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తెలంగాణలో చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వ్యవసాయ రైతాంగం సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపచడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం బీటీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అన్ని వర్గాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

నిందితుల స్వగ్రామాల్లో.. పటిష్ఠ బందోబస్తు

- కన్నీటి పర్యాంతమవుతున్న కుటుంబీకులు
- అన్యాయంగా ఎన్‌కౌంటర్ చేశారన్న ఏ-1 నిందితుడు హారీఫ్ తల్లి
- నా భర్తను ఎన్‌కౌంటర్ చేసినచోటే నన్ను చంపేయండి
- చెన్నకేశవులు భార్య ఆవేదన

మహబూబ్‌నగర్, డిసెంబర్6(ఆర్ఎన్ఎ) : షాబాద్‌లో వెటర్నరీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణంగా చంపేసిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో తెలంగాణ పోలీసులపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కామంతో రెచ్చిపోయి అమాయకురాలి ప్రాణం తీసిన మృగాళ్లకు పోలీసులు సరైన శిక్ష విధించారంటూ అన్నివర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌పై మృతుల కుటుంబసభ్యులు మాత్రం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డలను పోలీసులు అన్యాయంగా చంపేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన భర్తను పోలీసులు అన్యాయంగా చంపేశారని నిందితుల్లో ఒకడైన చెన్నకేశవులు భార్య ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఒక్క అమ్మాయి కోసం నలుగురిని పొట్టన పెట్టుకోవడం సరికాదని అంది. ఆపద సమయంలో 'దిశ' చెల్లిలికి ఫోన్ చేసే బదులు పోలీసులకు ఫోన్ చేస్తే ఈ ఘోరం జరిగేది కాదని పేర్కొంది. ప్రస్తుతం గర్భవతిగా ఉన్న చెన్నకేశవులు భార్య ఎన్‌కౌంటర్ విషయం తెలియగానే విషాదంలో మునిగిపోయింది. తన భర్త నేరం చేసినట్లు నిర్ధారించి తీర్పు ఇవ్వకముందే పోలీసులు ఇలా చేయడం తప్పని ఆమె ఆవేదన వ్యక్తంచేసింది. వారంరోజుల క్రితం తన భర్తను ఇంట్లో నుంచి బలవంతంగా తీసుకెళ్లారని, ఇన్నిరోజులు కనీసం ఆయన్ని కలిసేందుకు కూడా అనుమతించలేదని పేర్కొంది. మీ ఆయన ఇం